# రాజకీయంగా నష్టమని తెలిసినా సోనియా తెలంగాణ ఇచ్చారు



## ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర మరువలేనిది
## తెలంగాణ తల్లిని చూస్తే మా నాయనమ్మ గుర్తొచ్చింది
## శాసనసభలో మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసినప్పటికీ అధినేత్రి సోనియాగాంధీ త్యాగం వల్ల తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందని వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా చెప్పారు. రాష్ట్ర ఏర్పాటులో కవులు, కళాకారుల పాత్ర మరువలేనిదని, పట్టుదల, తెగింపునకు ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలు ప్రతిరూపాలుగా నిలిచాయని పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై మంత్రి దామోదర కృతజ్ఞత తెలిపారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 9న సోనియా గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరం ప్రకటన చేశారన్నారు. మళ్లీ అదేరోజున అంటే సోనియాగాంధీ జన్మ దినమైన డిసెంబరు 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం శుభపరిణామమని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పా టు ప్రకటన తర్వాత జరిగిన పరిణామాలపై నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో తెలంగాణ ఏర్పాటుపై తీర్మానం పాస్ చేశారన్నారు. కేంద్రంలోని యుపిఏ పెద్దలకు 'వై తెలంగాణ, వాట్ తెలంగాణ, వాట్ మోర్ తెలంగాణ, ఇనిసెక్యూరిటీ తెలంగాణ, ఫైనల్ రెమెడీ ఆఫ్ తెలంగాణ్ణ అనే అంశాలు లేవనెత్తినప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై యుపిఎ ప్రభుత్వ పెద్దలకు, యుపిఎ అధినేత్రి సోనియాగాంధీకి 45 నిమిషాలపాటు సుదీర్ఘంగా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను వివరించే అవకాశం తనకు దక్కడం ఎంతో గర్వంగా ఉంది న్నారు. ఈ సందర్భంగా సోనియాగాంధీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణతల్లి విగ్రహాన్ని చూసినప్పుడు మా నాయనమ్మ, అమ్మమ్మలు గుర్తుకొచ్చారని, తెలుగింటి సంస్కృతి, సంప్రదాయానికి ప్రతిరూపంగా తెలంగాణ తల్లి నిలిచిందని మంత్రి దామోదర పేర్కొన్నారు

# 11 నుంచి 13 వరకు జైపూర్, ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 9:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మళ్లీ ఢిల్లీకి వెళ్లనున్నారు. మూడు రోజుల పాటు జైపూర్, ఢిల్లీలో పర్యటించనున్నారు. డిసెంబర్ 11 నుంచి 13 వరకు ఇతర రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. మొదట వ్యక్తిగత పనుల నిమిత్తం రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్ళనున్నారు. అక్కడ ఒక వివాహ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఆ తర్వాత రెండు రోజులు ఢిల్లీలో పర్యటిస్తారు. ఢిల్లీలో తెలంగాణకు సంబంధించిన అంశాలపై వివిధ శాఖల కేంద్ర మంత్రులు, అధికారులతో చర్చిస్తారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతోనూ ఆయన సమావేశమవుతారు. కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై ఢిల్లీ పెద్దలతో చర్చించ నున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16వ తేదీ వరకు వాయిదా పడిన నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు, ఇతర ముఖ్యనేతలు కూడా ముఖ్యమంత్రితోపాటు ఢిల్లీకి వెళ్లే అవకాశముంది.



సిఎం రేవంత్‌రెడ్డికి వజ్రోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉపకులపతి అల్దాస్ జానయ్య

# 20, 21న వ్యవసాయ వర్సిటీ వజ్రోత్సవాలు

## సిఎం రేవంత్‌ను ఆహ్వానించిన ఉపకులపతి అల్దాస్ జానయ్య

**హైదరాబాద్ (అత్తాపూర్) డిసెంబరు 9, ప్రభాతవార్త:** ఈ నెల 20, 21 తేదీల్లో జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఆహ్వానించారు. రాష్ట్ర శాసనసభ ఆవరణలో సోమవారం ముఖ్య మంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రిని జానయ్య కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఉత్సవాలకు హాజరు కావడంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఉపకులపతి తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కూడా అల్దాస్ జానయ్య కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. అలాగే అనేకమంది మంత్రులని, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, రైతు, వ్యవసాయ సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిలను కూడా అల్దాస్ జానయ్య కలిసి రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల్లో పాల్గొనవలసిందిగా కోరారు.

# హస్తం గుర్తుకాదది.. ఆశీస్సులు ఇవ్వడం

## సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణ తల్లి విగ్రహంలో హస్తం గుర్తుఉందని విమర్శలు చేస్తున్నారని కానీ అది తల్లి ఆశిస్సులు ఇస్తున్నట్లు ఉందని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 17ను భేష జాలు లేకుండా అధికారికంగా నిర్వహించాలని ఆయన కోరారు. సోని యాగాంధీ సత్యశీలి ఆమె తెలంగాణ ఇస్తానని మాట నిలుపు కున్నారని ఆయన అన్నారు. టిఆర్ఎస్ బిఆర్ఎస్‌గా మారొచ్చుకానీ తెలంగాణ తల్లివిగ్రహం మార్పుచేయడం తగదా అని ఆయన ప్రశ్నిం చారు. మీరు అనుకున్నట్లు ఎదుటివారి భావన ఉండాలనుకోవడం కుదరదు అని ఆయన అన్నారు. తెలంగాణ తల్లిని మీరు రూపొందించినప్పుడు ప్రతి పక్షాలను సంప్రదించారా ఏకాభిప్రాయం తీసుకున్నారా అని ప్రశ్నిం చారు. తెలంగాణ కోసం నేను ఏడు రోజులు జైలుకు వెళ్ళిన ఏడు వందల కిలోమీటర్లు నడిచాను. నాతోపాటు కొమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావులు ఇలా ఎంతోమంది వారి పదవులకు రాజీనామా చేసి తెలంగాణకోసం పోరాడినాము. మా సిపిఐ లీడరు బర్ధన్, సుధాకర్‌రెడ్డి, అదేవిధంగా కోదండరామ్ వంటివాళ్లు ఎందరో సకల జనులు పోరాటం చేయడంతో తెలంగాణ వచ్చింది. సింగరేణి, ఆర్టీసి కార్మికులు మా నేతృత్వంలో పోరాటంచేశారని తెలంగాణ రావడానికి సిపిఐ పోరాటమే కారణమని ఆయన తెలిపారు. రాజ కీయాల కోసం తెలంగాణతల్లిని వివాదాల్లోకి లాగితే తెలంగాణ సమాజంతోపాటు చరిత్రకూడా క్షమించదు అని ఆయన అన్నారు.

# భేషజాలు పక్కనబెట్టి విగ్రహం ఆవిష్కరించుకుందాం

## సంస్కృతికి, చరిత్రకు అద్దంపట్టేలా
## తెలంగాణ తల్లి రూపం : మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణ తల్లి రూపకల్పనపై అసెంబ్లీలో జరిగే చర్చలో బిఆర్ఎస్ పాల్గొంటుందని భావించాను కానీ ఉద్దేశపూర్వకంగానే సభకు దూరంగా ఉన్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. రాజకీయ కారణాలతో అసెంబ్లీకి రాకుండా ఉండటానికి ఎత్తుగడలా ఉందని అన్నారు. చట్టసభలకు వచ్చేవారు రూల్స్‌కు, ప్రొసి జర్‌కు విరుద్ధంగా ఉండకుండా రావాలని ఆయన కోరారు. రాజకీయ బేషజాలు పక్కనపెట్టాలని ఆయన కోరారు. తమను కూడా సభకు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆయన అన్నారు. చరిత్రకు దర్పణంగా తెలంగాణ తల్లిని రూపొందించామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ తల్లిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనపై అసెంబ్లీలో బిఆర్ఎస్ మాట్లాడుతుందని అనుకున్నామని శ్రీధర్‌బాబు అన్నారు. ఉద్దేశపూర్వకంగానే సభకు దూరంగా ఉన్నారని, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు చారిత్రక ఘట్టంలో వారి అనుభవాలు కూడా రెండు మాటలు చెప్పి తల్లి రూపకల్పన ఆమోదం తెలిపితే బాగుండేదని మంత్రి శ్రీధర్‌బాబు అభిప్రాయపడ్డారు. 2009 డిసెంబరు 9వ తేదీ.. సోనియాగాంధీ ఉద్యమకారుల పోరాటం ఆశయాలకు అనుకూలంగా స్పందించి ప్రకటన చేసినరోజు ఇది అని ఆయన అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, లీడర్లు కానీ ఆ చారిత్రాత్మక కార్యక్రమంలో గొప్ప అనుభవాన్ని చట్టసభలో వివరించే అవకాశం వారికి ఉండేదని అన్నారు. రాజ కీయాలు ప్రస్తావించకుండా తెలంగాణతల్లిని మన సంస్కృతికి నిలు వుటద్దంలా ప్రదర్శించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహవిష్కరణకు వారంతా రావాలని, అప్పుడే ఇది సమగ్రంగా ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఆంధ్రప్రదేశ్ నుంచి బిజెపి ఎంపి అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్య

**విజయవాడ, డిసెంబరు 9, ప్రభాతవార్త ప్రతినిధి:** మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన రాజ్యసభ అభ్యర్థుల జాబితాను బిజెపి ప్రకటించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్.కృష్ణయ్యకు అవకాశం కల్పించింది. గతంలో వైఎస్సార్సీపి నుంచి రాజ్యసభకు ఎన్నికైన ఆర్.కృష్ణయ్య, కొద్ది నెలల క్రితం రాజీనామా చేశారు. గతంలో వైఎస్సార్సీపి నుంచి రాజ్యసభకు ఎన్నికైన ఆర్.కృష్ణయ్య తన పదవికి రాజీనామా చేశా రు. ఆయన రాజీనామా లేఖను సెప్టెంబరు 23న రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు ఆర్. కృష్ణయ్య అందజేశారు. కృష్ణయ్య రాజీనామాను ఆమోదిస్తున్నట్లు అదే నెల 24న ప్రకటించారు. పదవీకాలం 4 సంవత్సరాలు ఉండగానే కృష్ణయ్య రాజీనామా చేశారు. తెలంగాణలో బిసి ఉద్యమాన్ని బలో పేతం చేసేందుకు కొన్ని అడ్డంకులు ఉన్నాయని, అందువలనే తన పదవికి రాజీనామా చేసినట్టు ఆ సమయంలో ఆర్.కృష్ణయ్య పేర్కొనడం గమనార్హం. తాజాగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్. కృష్ణయ్యకు బిజెపి అవకాశం కల్పించింది.



ఆర్.కృష్ణయ్య

**మరో రెండు సీట్లపై కొనసాగుతున్న సస్పెన్స్..**

ఎపిలో ఖాళీగా ఉన్న మరో రెండు సీట్లపై సస్పెన్స్ కొనసాగుతోంది. టిడిపి, జనసేన త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. వైఎస్సార్సీపిలో జరుగుతున్న వ్యవహారాలు నచ్చక రాజ్యసభ పదవికి రాజీనామా చేసిన ఆ పార్టీ ఎంపిలు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు తరువాత టిడిపిలో చేరారు. దీంతో వారికే అవకాశం ఇస్తారా, లేదంటే మరొకరిని నామినేట్ చేస్తారా అనేది త్వరలోనే తెలిసిపోనుంది.

# శ్రమైక జీనవానికి నిండురూపం తెలంగాణ తల్లి

## కెటిఆర్ చెల్లికి దేవతారూపం పెట్టి ప్రజలపై రుద్దారు
## పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఎందుకు ఆవిష్కరించలేదు?
## పంచాయతీరాజ్ మహిళా శిశు సంక్షేమ మంత్రి సీతక్క



**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణ తల్లి విగ్రహం శ్రమైకజీవనంకు నిండు రూపంగా ఉందని పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శాసనసభలో సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన విగ్రహంలో తెలంగాణీయుల అస్తిత్వం, ఆత్మ గౌరవం, పోరాటం, ఆశీర్వాదం కలగలిపి ఉందని అన్నారు. సొంత ఎజెండాతో తెలంగాణ తల్లి విగ్రహంపై రాజకీయాలు చేస్తున్నా రని విమర్శించారు. తెలంగాణతల్లి విగ్రహంలో మార్పులు చేస్తున్నారని బిఆర్ఎస్, బిజెపి నేతలు మాపై ప్రచారం చేస్తున్నారని గత పదేళ్లలో ఎందుకు అధికారికంగా తెలంగాతల్లి విగ్రహం ఎక్కడైనా ఆవిష్కరించారా అని ప్రశ్నించారు. కెటిఆర్ చెల్లికి దేవతారూపం పెట్టి ప్రజల మీద రుద్దారని ఆమె ఆరోపించారు. తెలంగాణ తల్లి సాటి తల్లి, చెల్లి, అమ్మ, తెలంగాణ బిడ్డలు పోలి ఉందని ఆమె అన్నారు. తెలంగాణ విగ్రహం చూస్తుంటే మమ్మల్ని మేము చూసుకుంటున్నట్లుగా ఉందన్నారు. గత విగ్రహం అక్కచెల్లి బిఆర్ఎస్‌వాళ్ళ ఇంట్లో వాళ్ళను పోలి ఉండేవని అన్నారు. తెలంగాణ బిడ్డలు అంటే మట్టి బిడ్డలు, ఎట్టిబిడ్డలు కాదని, గట్టిబిడ్డలు శ్రామిక రూపాన్ని తెలంగాణ తల్లిలో చూస్తున్నందుకు గర్వంగా ఉంటుందని సీతక్క అన్నారు. గుండెల నిండా పాడుకునే జయజయహే తెలంగాణ పాటను రాష్ట్రగీతంగా ఏర్పాటు చేయాలని ఆలోచన గత పాలకులకు రాలేదని నేడు మేం చేస్తుంటే అడ్డుకుంటున్నారని ఆమె ఆరోపించారు. టిజి అని ఉద్యమ సమయంలో అని అధికారంలోకి వచ్చాక టిఎస్ అని మార్చారని అన్నారు. అప్పుడు బిజెపి మాట్లాడలేదు. పార్టీ పేరులో తెలంగాణ పదాన్ని తొలగించారు. ఇప్పుడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ తల్లి ఉంది అని ఆయన అన్నారు. డిసెంబరు 9న ఉచిత బస్సుప్రయాణం ప్రారంభించి నాలుగువేల కోట్లుఉచిత బస్సు ప్రయాణం కింద ప్రభుత్వం సంవత్సరకాంలో భారం మోసిందనితెలిపారు. ఆర్టీసి లాభాల బాటలో పెట్టామని తెలిపారు. 118 కోట్ల పర్యాయాలు ఉచితంగా మహిళలు ప్రయాణం చేశారు. మా యుపిఏ హయాంలో 450కు ఉన్న సిలెండర్ ధరను 12వందలకు పెంచారని ఇప్పుడు మేం 500కు గ్యాస్ సిలెండర్ ఇస్తున్నామని తెలిపారు.

# నాలుగు కోట్ల ప్రజలు తెలంగాణ తల్లిబిడ్డలే..

## తెలంగాణ తల్లిని గౌరవించుకొంటూ హుందాతనం కాపాడుకొందాం
## బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ఏ కడుపులో బిడ్డైన నాలుగుకోట్ల ప్రజలు తెలంగాణ తల్లిబిడ్డలే మనం అంతా ఒక్కటే అని చాటి చెప్పడానికి ఒక మంచి ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఆలోచనకు మా మద్దతు ఉంటుందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతూ ఉంటాయి నాయకులు మారుతూ ఉంటారు కానీ తెలంగాణ తల్లి విగ్రహం అనేది మన అస్థిత్వం తెలుపుకోవడానికి వీలుగా ఉంటుందని ఆయన తెలిపారు. తెలంగాణ తల్లి ఎవరికో ఒకరికి సంబంధించిన విగ్రహం కాదని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు సంబంధించినది అని ఆయన అన్నారు. తాము ఉద్యమాలలో పాల్గొన్నామని అది గతం ఇప్పుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ తల్లిని గౌరవించుకుంటూ శాసనసభను హుందాగా జరుపుకుందామని ఆయన కోరారు. శాసనసభ మర్యాదలు, గౌరవానినన కాపాడాలని సభలో మాట్లాడే భాష, వ్యవహరించే తీరు బాహ్య ప్రపంచానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. చిల్లరమల్లర మాటలు బంజేసి ఒకరిని ఒకరు నిందించుకోకుండా తెలంగాణ ఆదర్శమైన రాష్ట్రంగా పేరు తెచ్చుకోవాలని ఆశించారు. విప్ బీర్లబీరయ్య మాట్లాడుతూ రాజకీయ ఆర్థిక సామాజిక సమతుల్యతకు గుర్తుకుగా తెలంగాణ తల్లి విగ్రహం ఉందని అన్నారు. ఎమ్మెల్యే నల్లమడ పద్మావతి ఉత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ అచ్చం అమ్మను పోలినట్లు ఉందని తెలంగాణ తల్లివిగ్రహంపై వ్యాఖ్యానించారు.

# అట్టహాసంగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

## జనసందోహంగా మారిన సచివాలయం, ట్యాంక్‌బండ్.. భారీగా ట్రాఫిక్‌జామ్

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం సచివాలయంలో సోమవారం సాయంత్రం అట్టహాసంగా జరగగా ఈ కార్యక్రమా న్ని తిలకించేందుకు మహిళా సంఘాల ప్రతినిధులతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సచివాలయం సహా ట్యాంక్‌బండ్ పరిసరాలు జనసందోహంగా మారాయి. దీంతో వరుసగా రెండవ రోజు కూడా సచివాలయం, ట్యాంక్‌బండ్ పరిసరాలలో గంటల తరబడి ట్రాఫిక్ జాం ఏర్పడి వాహనదారులకు ఇక్కట్లు కలిగించా యి. ఆదివారం నాడు సచివాలయం, నెక్లెస్ రోడ్డు మార్గాలలో సర్కారు విజయోత్సవాలను నిర్వహించడం తెలిసిందే. ఈ సందర్భంగా ఎయిర్ షో కూడా నిర్వహించ డం విదితమే. ఎయిర్ షోను తిలకించేందుకు వీలుగా ట్యాంక్‌బండ్ మార్గాన్ని మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల పాటు మూసివేశారు. దీంతో ఈ ప్రాంతంలో వేల సంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఎయిర్ షోను ప్రత్యక్షంగా చూశారు. ఈ కార్యక్రమం వల్ల సాయంత్రం ఆరు గంటల వరకు ఈ ప్రాంతంలో ట్రాఫిక్ జా ం ఏర్పడింది. ఇక సోమవారం విషయానికి వస్తే సాయంత్రం ఆరు గంటల సమయంలో సచివాలయం లోపల ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సిఎం రేవం త్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం కోసం జంట నగరాలు, శివార్ల నుంచి వేల సంఖ్యలో మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు తరలివచ్చారు. వీరి కోసం ఆయా ప్రాంతాలలో ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సుల్లో వచ్చిన మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు సచివాలయం ప్రాంగణంలో తమ కు కేటాయించిన ప్రాంతం నుంచి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వీక్షించారు. ఇదే సమయంలో ట్యాంక్‌బండ్‌పైనా జనం భారీగా తరలివచ్చారు. దీంతో సచివాలయంతో పాటు ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ మార్గాలలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచే ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయడంతో ఈ మార్గాలలో రాక పోకలు సాగించిన వారు అష్టకష్టాలు పడ్డారు. ఈ మార్గాలలో వచ్చిన వాహనాలను వేరే మార్గాల గుండా మళ్లించారు. ఇందుకోసం ట్రాఫిక్ పోలీసులను భారీగా రంగం లో దించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం ముగిసిన గంటన్నర తరువాత కానీ ట్రాఫక్ సమస్యలు తీరలేదు.

# హైకోర్టులో చెన్నమనేనికి చుక్కెదురు

## కోర్టును తప్పదోవ పట్టించారని ఆగ్రహం
## చెన్నమనేని పిటిషన్ డిస్మిస్
## రూ.30లక్షల జరిమానా విధించిన న్యాయస్థానం



చెన్నమనేని రమేష్

**వేములవాడ, ప్రభాతవార్త:** హైకోర్టులో వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌కు చుక్కెదురైంది. తప్పుడు సమాచారంతో ఎన్నికల్లో పోటీ చేశారంటూ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ గతంలో చెన్నమనేని రమేష్‌కు వ్యతిరేకంగా ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. గత కొన్నేళ్లుగా ఈ పిటి షన్‌పై వాధనలు జరుగుతున్నాయి. అయితే తనను భారతీయుడుగా గుర్తించాలని ఆయన వేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఎట్టకేళకు చెన్నమనేని రమేష్ జర్మనీ పౌరుడేనని హైకోర్టు తేల్చింది. చెన్నమనేని రమేష్ న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించారని ఆయనపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో చెన్నమనేని సమర్పించిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. పదిహేనున్నరేళ్ల పాటు హైకోర్టులో చెన్నమనేని కేసు సుదీర్ఘకాలం పాటు విచారణ జరిగింది. విచారణలో తప్పుడు సమాచారం, ఫేక్ డాక్యుమెంట్లు సమర్పించారని ఆయనపై హైకోర్టులు ఆగ్రహ వ్యక్తం చేసింది. చెన్నమనేని రమేష్‌కు హైకోర్టు 30లక్షల జరిమానా విధిస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు 25లక్షల రూపాయలు చెల్లించాలని, మరో 5లక్షల రూపాయలు హైకోర్టు లీగల్ సర్వీస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశించింది. నెల రోజుల్లోపు చెల్లింపు పూర్తి చేయాలని సూచించింది. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌పై 18 ఏళ్లుగా న్యాయ పోరాటం చేసి గెలిచానని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.

# రేవంత్ పాలన చూస్తే ఆనందం కలుగుతోంది

## బిజెపి ఎమ్మెల్యే పాయల శంకర్

**హైదరాబాద్, డిసెంబరు 9,ప్రభాతవార్త:** తెలంగాణలో గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలు సాహసోపేతంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్పులు చేయడం ఎంతో ఆనందం కలుగుతోన్నదని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహంలో హస్తం చూపడం వారి పార్టీ గుర్తును ప్రదర్శిస్తున్నదని ఆ చేతిలో బతుకమ్మను ప్రదర్శిస్తే బాగుండేందని సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి నిర్ణయాలు చేసేప్పుడు ప్రతిపక్షాలతో ఒక సమావేశం ఏర్పాటు చేసిచేయాలని ఆయన కోరారు. తెలంగాణలో అన్ని వ్యవస్థలు,ఆర్థిక పరిస్థితి గత ప్రభుత్వం చిన్నా భిన్నంచేసిందని వాటిని సంస్కరించాలని సూచించారు. 317 జివో ప్రభుత్వ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని ఈ జివోపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జిపిఎఫ్ కూడాతీసుకోని పరిస్థితి ఉందని ఆయన ఆవేదన చెందారు.

# వైద్య, ఆరోగ్య కమిషనరేట్ వద్ద ఆశా వర్కర్ల ధర్నా

## కార్యకర్తలకు, పోలీసుల మధ్య తోపులాట, ఉద్రికత్తత.. ఇద్దరికి గాయాలు





**గోషామహల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణ ఆశా వర్కర్ల తమ డిమాండ్ల సాధనకై సోమవారం కోఠి వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులకు, ఆశా వర్కర్ల వర్కర్ల మధ్య తోపులాట కొనసాగింది. పోలీసుల తోపులాటలో ఇద్దరు ఆశా వర్కర్ల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. సొమ్మసిల్లి పడిపోయిన ఓ ఆశా వర్కర్ పరిస్థితి విషమంగా ఉండడంతో అంబులెన్స్ లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆశా వర్కర్లకు లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని వారు కోరారు. పలుసార్లు నిరసన చేపట్టినా పట్టించు కోవడం లేదని ఆశా కార్యకర్తలు ఆరోపించారు. డిసెంబర్ 2వ తేది నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో లెప్రసీ సర్వే చేయాలని ఆశాలకు జిల్లా అధికారులు చెప్పుతున్నారని, వెంటనే లెప్రసీ ట్రైనింగ్ కూడా ప్రారంభించాలని అధికారులు ఒత్తిడి తీసుకు వస్తున్నారు. ఈ నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని ఆశలు డిమాండ్ చేశారు. పెండింగ్ డబ్బులపై అధికారులు స్పందిస్తూ ప్రభుత్వం నుంచి డబ్బులు రాలేదని ప్రొసిడింగ్ ఆర్డర్స్ ఇచ్చినంత మాత్రాన డబ్బులు ఇచ్చినట్లు కాదని అంటున్నారన్నారు. రెండు సంవత్సరాల నుంచి చేసిన లెప్రసీ సర్వే 2024లో చేసిన పల్స్ పోలియో డబ్బులు రాక ఆశాలు ఆర్థికంగా తీవ్రంగా నష్ట పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. సంవత్సరాల తరబడి చేసిన పనికి డబ్బులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ఇప్పుడు మళ్లీ తిరిగి లెప్రసి సర్వే చేయాలని ఒత్తిడి చేయడం, ఎంతవరకు న్యాయమని ఆశా వర్కర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించి ఆశాలను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

**ఉద్రికత్త పరిస్థితులకు దారితీసిన ఘటన**

హైదరాబాద్‌లోని కోఠిలోని వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఆశావర్కర్లు ఆందోళన చేపట్టారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామి ప్రకారం.. 18వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కమిషనర్ కార్యాలయ నుంచి రహదారి బైఠాకు వచ్చారు. అక్కడ బందో బస్తులోఉన్న సుల్తాన్‌బజార్ ఎసిపి శంకర్ పర్యవేక్షణలో సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసు చ్యారులు తమ అదనపు పోలీసు బందోబస్తును నిర్వహిస్తున్నారు. వారిని అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రికత్త పరిస్థితి నెలకొంది. రోడ్డుపైకి వస్తున్న ఆశా వర్కర్లకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి విషమించడంతో పోలీసులు వారిని బలవంతంగా ఆరెస్ట్ చేసి పోలీసు వ్యాన్‌లో ఎక్కించారు. వ్యాన్‌లో ఎక్కిస్తున్న సమయంలో ఓఆశ వర్కర్ చేతి అందులో చిక్కింది. దీంతో తన చేతికి గాయకావడంతో వెంటనే అక్కడ ఉన్న పోలీసు బాధలో చెయ్యి చేసుకుంది. దీంతో పరిస్థితి ఉద్రిక్తత దారితీసింది. పోలీసు ఓవర్ యాక్షన్, ఆశా వర్కర్ల మధ్య తీవ్ర తొపులాట జరిగింది. స్పృహ్వా తప్పి కింద పడిపోయిన ఇద్దరు ఆశా వర్కర్లను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటి వరకు వారి పరిస్థితి ఆందోళ కరంగా మారింది. వైద్యులు సకాలంలో వైద్యపరీక్షలు చేయడంతో సంతోషకి కొలుకుంది.

**అనుచితంగా వ్యవహరించిన సుల్తాన్‌బజార్ ఎసిపి, సిఐ**

తమ హక్కుల డిమాండ్ల సాధనకై ఆశా వర్కర్ల ఆందోళనలో పోలీసు లకు, ఆశావర్కర్ల మధ్య తీవ్ర తోపులాట కొనసాగింది. పోలీసుల సహకారంతో ఆందోళన కారులను వ్యాన్‌లో ఎక్కించిన తరువాత ఎసిపి శంకర్ ఆ మహిళపై అనుచితంగా ప్రవర్తించడం పట్ల పలువురు తీవ్రంగా వ్యతిరేకించారు. విధినిర్వహణలో ఉన్న ఎసిపి శంకర్, సిఐ శ్రీనివాసుల చార్యులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించినట్లు ఆందోళనకారులు అన్నారు. వర్కర్ల ఆందోళనలో పోలీసులు ఓవరాక్షన్, పోలీసుల దాడిలో పలువురు ఆశా వర్కర్లకు గాయాలు, మహిళలతో ఎసిపి శంకర్ అనుచిత ప్రవర్తన, పోలీసులు, ఆశావర్కర్లు మధ్య తీవ్రవాగ్వాదంలో పోలీసు దాడిలో గాయపడిన సంతోష రెండుగంటల తరువాత కొలుకు న్నది.

**ఉస్మానియా ఆస్పపత్రి వద్ద పోలీసుల తీరుపై మాజీమంత్రుల మండిపాటు**

ఇందిరమ్మ రాజ్యమంటే మహిళలపై పోలీసుల చేత దాడులు చేయిం చడమా అని బిఆర్ఎస్ మాజీ మంత్రులు గంగుల కమలాకర్, మహ మూద్అలీ, సత్యవతిరాథోడ్, సబితా ఇంద్రారెడ్డి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలె సంతోషను పరా మర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణలో ఏ ఒకరు సంతోషంగా లేరని, అసభ్యపదజాలంతో దూషించిన ఎసిపి శంకర్, సిఐ శ్రీనివాసుచార్యులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కరోనా సమయంలో ప్రాణాలను తెగించిన ప్రజల ప్రాణాలను కాపాడిన ఆశవర్కర్లపై పోలీసులు దాడులు చేయడం పట్ల ఎంత వరకు సమంజ సమని ప్రశ్నించారు. చివరకు ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు మందులు లేవన్నారు. ప్రభుత్వం ఇవ్వకుంటే వైద్యులు, అధికారులు, సిబ్బంది ఏమి చేస్తారన్నారు. ఆశ వర్కర్లకు 18వేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ హాయంలో ఆశ వర్కర్లను పిలిపించి వారికి భోజనాలుపెట్టి వారి డిమాండ్లను అడిగి తెలుసుకున్నట్లు వారు గుర్తు చేశారు.

